'ఆడుదాం ఆంధ్ర'కు పలువురి రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఆడుదాం ఆంధ్రలో భాగంగా కిర్లంపూడి మండలంలో దాదాపు 800 వరకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఎంపిడిఒ బడే రాజేశ్వరరావు తెలిపారు. డిసెంబర్ 15 నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సచివాలయ స్థాయిలో ప్రారంభమవుతాయని వాటిలో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పాల్గొని విజయం సాధించిన వారికి ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని, మండల పరిధిలోని క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను వీక్షించేందుకు సచివాలయాల్లో ఇప్పటికే 500 మంది వరకు ప్రేక్షకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు.

పొంచి ఉన్న తుపాను ముప్పు

- అన్నదాతల్లో అలజడి
- మూడు రోజులపాటు వర్షాలు
- సహాయ చర్యల్లో యంత్రాంగం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తుపాను ముప్పు హెచ్చరికలతో జిల్లా వాసులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో పంటలను కోల్పోయిన రైతాంగానికి పుండు మీద కారంలా తుపాను మారనున్న నేపథ్యంలో మిగిలి ఉన్న వారి ఆశలు మరింత ఆవిరి కానున్నాయి. తుపాను ప్రభావంతో శనివారం వాతావరణంలో మార్పులు కనిపించాయి. కొన్ని చోట్ల చిరు జల్లులు మొదలయ్యాయి. గాలులు వీస్తున్నాయి. ఇప్పుడు ప్రస్తుతం పలు చోట్ల వరి పనుల మీద ఉన్న నేపథ్యంలో పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తుపాను హెచ్చరికలతో సహాయక చర్యలు కోసం జిల్లా యంత్రాంగం అంతా సిద్ధంగా ఉంది. పాఠశాలలకు సెలవులు మంజూరు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది.

తుపాను కారణంగా ఈ నెల 3 నుంచి 5 వరకూ జిల్లావ్యాప్తంగా పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురియనున్నాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సహాయక చర్యలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. విశాఖ భారత వాతావరణ శాఖ ద్వారా నైరుతి బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడగా పశ్చిమ, వాయువ్య దిశలో 69 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఈ ప్రభావంతో నేటి నుంచి 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈదురు గాలులు, భారీ వర్షాల వల్ల జన జీవనం తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా వుండాలని, తాటాకు, కచ్చా ఇళ్ళల్లో నివశిస్తున్న వారందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని యంత్రాంగం సూచిస్తుంది.

కంట్రోల్ రూముల ఏర్పాటు

తుపాను ప్రభావం దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా కలక్టర్ కార్యాలయంలో 18004253077, కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయంలో 800883208, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో 9603663227 నెంబర్లను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, అగ్నిమాపక, గ్రామీణ నీటి సరఫరా శాఖ, విద్యుత్, పంచాయత్ రాజ్, రోడ్లు, భవనాల శాఖ, పోలీస్ తదితర ముఖ్య శాఖలకు సెలవులు రద్దు చేశారు. అందరూ తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. తుపాను ప్రభావిత తీర ప్రాంతాల్లో ముందు జాగర్త చర్యలు తీసుకోవల్సిందిగా అధికారులను ఆదేశాలిచ్చారు.

కరపలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

తీర ప్రాంతాల్లో అలర్ట్

జిల్లాలో తీర ప్రాంతంలో ప్రజలు భయం బయంగా గడుపుతున్నారు. తుపాను ప్రభావం ఏ విధంగా ఉంటుందోనన్న ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది. అలల ఉధృతి ఎక్కువగా ఉండవచ్చని తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ ప్రభావం వల్ల కెరటాల ఉధతి తీవ్రంగా ఉంటుందని, మత్స్యకారులు పడవలు, వలలు, తాళ్ళ తీరానికి దూరంగా తరలించాలన్నారు. గాలులు వీస్తున్న సమయంలో ప్రజలు వెలుపలకు రావద్దని, ఇళ్లల్లో సురక్షితంగా ఉండాలని, పశువులను బయట వదలకూడదని మత్స్యశాఖ అధికారులు సూచించారు.

యంత్రాంగం అప్రమత్తం

ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది కాబట్టి ఎక్కడైనా చెట్లు, కరెంటు స్తంబాలు పడిన వెంటనే వాటిని తొలగించి రవాణా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేయడానికి రహదారులు భవనాలు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో అవసరమయ్యే జెసిబిలు, పవర్ కట్టర్లు, పవర్ సాస్, ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచారు. విద్యుత్ తీగలు తెగి కింద పడినా, ఎక్కడైనా ప్రమాదకరంగా కనపడినా విద్యుత్ శాఖకు సమాచారం ఇస్తే వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, ప్రజలు తగు స్వీయ భద్రతా చర్యలు పాటించాలని కోరారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిరక్షించడానికి వ్యవసాయ శాఖ ఇప్పటికే రైతులందరికీ తగు సూచనలు జారీ చేసింది. జిల్లా పంచాయతీ అధికారి, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులు నింపుకొని,విద్యుత్ సరఫరా లేని సమయంలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసుకుని ఇబ్బంది లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

అన్నదాతల్లో ఆందోళన

తుపాను ముంచుకొస్తోందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. చివరిలో చేతికందే సమయంలో వర్షాలు పడితే నష్టం తప్పదనే ఆందోళనలో రైతులు ఉన్నారు. కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. గండం నుంచి గట్టెక్కాలని కోరుకుంటున్నారు.

పేదలకు అసరాగా వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-కాజులూరు

పేదలకు ఆసరాగా ఉండటమే సిఎం వైఎస్.జగన్ లక్ష్యమని బిసి సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని 14 గ్రామాలకు సంబంధించి 243 మంది రైతులకు డి.ఫారం పట్టాలు పంపిణీ చేశారు. జిల్లాలో పేద రైతంగాన్ని ఆదుకునే విధంగా పట్టా భూముల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పేద రైతులకు భూమి ఉంటే ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. గ్రామాల్లో ఉన్న యువత ఉద్యోగ ప్రయత్నాలతో పాటు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలన్నారు. జీవనోపాధి పెంపొందించుకునే యువతకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయం కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి, గుబ్బల యేసు రాజు, సర్పంచ్ దండంగి సరోజినీ చిన్నారావు, తహశీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ వేగేశ్వరరావు, పాల్గొన్నారు.

హక్కు పత్రాలు అందిస్తున్న మంత్రి వేణుగోపాల కృష్ణ

ధర్నా చేస్తున్న మెస్ వర్కర్స్

జీతాల కోసం మెస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

మెస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రెండో రోజు ఆందోళనలో భాగంగా కాకినాడ జిజిహెచ్ తల్లీ బిడ్డ విగ్రహం వద్ద కార్మికులు శనివారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, మెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శంకర్, ఎ.ఏడుకొండలు మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి కాకినాడ జిజిహెచ్‌లో రోగులకు ఆహార అందించడంలో మెస్ కార్మికులు ఎంతో శ్రమ పడుతున్నారని, అటువంటి కార్మికులకు రెండు నెలల కాలం నుంచి కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని చెప్పారు. ఎనిమిది నెలల కాలం నుంచి కార్మికుల పిఎఫ్ వాటా రూ.7 లక్షల వరకు సొమ్ము కట్ చేసుకుని పిఎఫ్ ఖాతాకు జమ చేయకుండా కాంట్రాక్టర్ వద్ద పెట్టుకున్నారన్నారు. ఈ కాంట్రాక్టర్ కాలపరిమితి 2024 ఏప్రిల్ నెలతో ముగియనుందని, సొమ్ము పిఎఫ్ ఖాతాకు జమ చేయకపోతే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి అన్నారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీను, ఎస్.శ్రీను, సురేష్, విజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఉపసంహరించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన న్యూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) పిఠాపురం అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌వి.రమణారావు, కొంగు నూకరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యాక్ట్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ఈ చట్టంలో స్థానిక సివిల్ కోర్టులకు విచారణ పరిధి (జ్యూరిడిక్షన్) లేకుండా చేశారన్నారు. కేవలం టైటిలింగ్ అధికారులకే అధికారం కట్టబెట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ల్యాండ్ టైటిలింగ్ అధికారులపై రాజకీయ జోక్యం ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సులభంగా వేగంగా కేసులు పరిష్కారం చేయాలని భావిస్తే కోర్టులను పెంచి, సిబ్బందిని నియమించాలన్నారు. అంతేకాక అవసరమైన చోట్ల ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. అంతేగాని సివిల్ కోర్టులు చేయాల్సిన పనిని ల్యాండ్ టైటిలింగ్ అధికారులకు అప్పజెప్పడం ద్వారా పేదలకు మేలు కన్నా నష్టమే ఎక్కువ జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ అధికారులు ఇచ్చిన తీర్పుపై హైకోర్టుకు మాత్రమే వెళ్లే అవకాశం ఉందన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి కొండపైన నిరంతర రాయంగా కొన సాగుతున్న స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి దాత ఒకరు రూ.లక్ష విరాళం అందించారు. శనివారం సికింద్రాబాద్‌కు చెందిన శ్రీ సత్య టెక్నాలజీస్‌కు సంబంధించిన చెక్కును దేవస్థానం చైర్మన్ రాజా ఐవి.రోహిత్‌కు అందజేశారు

విరాళం అందజేస్తున్న దాత

వల్లభ స్వామికి రూ 4.13 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,01,500, అన్నదానం విరాళాలు రూ.1,05,699, కేశఖండన ద్వారా రూ.6,360 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీకుమార్, గ్రామస్తులు సేవలందించారన్నారు.

అధికారం వచ్చాక అందరికీ న్యాయం

పాదయాత్రలో నారా లోకేశ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

పిఠాపురం టిడిపి అధికారంలోకి వచ్చాక అన్ని సామాజిక తరగతులకూ న్యాయం చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. శనివారం యువగళం పాదయాత్ర కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి మొదలై పిఠాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ సామాజిక తరగతులకు చెందిన వారు, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, మెకానిక్స్ తదితరులు తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రాలు అందించారు. ఆయనతో సెల్ఫీలు దిగారు. కుక్కుటేశ్వరస్వామి ఆలయం సెంటర్‌లో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు టీచర్స్, లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సిఎం వైఎస్.జగన్ విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారని లోకేష్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటీ టీచర్లు, లెక్చరర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రి వద్ద బిసిలతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ 10 శాతం తగ్గించడంతో 16,500 మంది బిసిలు పదవులకు దూరమయ్యారన్నారు. రూ.75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి అన్యాయం చేశారన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో ఎస్‌సిలు వినతిపత్రం అందించారు. జగన్ రద్దు చేసిన 27 దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబును జగన్ వెంటేసుకుని తిరుగుతున్నారన్నారు. పిఠాపురం పాతబస్టాండులో మోటారు మెకానిక్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, యు.కొత్తపల్లి మండలంలో ఉప్పాడ వరకు పాదయాత్ర సాగింది.

కౌలు రైతుల సమస్యలపై వినతి

రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలపై లోకేష్‌కు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో ఖర్చులు అధికం కావడం వల్ల భూ యజమానులు భూమిని వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపార రంగంలో స్థిరపడుతున్నారన్నారు. కూలి, నాలి చేసుకునే ఎస్‌సి, బిసి, ఒలు కౌలు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అటువంటి కౌలు రైతులకు రెక్కల కష్టం మిగలడం లేదని అన్నారు. ఈ కాలంలో పెరిగిన ధరలు, గిట్టుబాటు ధర లేకపోవడం కౌలు రైతులకు అప్పులే మిగులుతున్నాయన్నారు.

పిఠాపురంలో పాదయాత్రలో పాల్గొన్న లోకేష్

సామర్లకోటలో ధాన్యం మాల

పామాయిల్ రైతుల వినతి

సామర్లకోట రూరల్‌లో నారా లోకేష్‌కు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి ఆధ్వర్యంలో 75 కిలోల ధాన్యంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. రైతుల సమస్యలపై వివరించారు. పామాయిల్ రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల బుజ్జి ఆధ్వర్యంలో తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రం అందించారు. పవర, పండ్రవాడలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో మహిళలు లోకేష్‌కు హారతులు పట్టారు. నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాసు, రాజా సూరిబాబు రాజు, గుణ్నం చంద్రమౌళి, జనసేన పెద్దాపురం ఇన్చార్జ్ తుమ్మల రామస్వామి, కంటే జగదీష్ మోహన్ పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి పిఠాపురం నియోజకవర్గంలో నారా లోకేష్ బహిరంగ సభను రద్దు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి కారణంగా వచ్చిన అభిమానులకు సెల్ఫీలు తీసుకునే విధంగా అవకాశం కల్పించారు పిఠాపురం నుంచి నవకండ్రవాడ, కొండవరం, మీదగా ఎండపల్లి జంక్షన్‌కు లోకేష్ చేరుకుని అక్కడ బస చేయనున్నారు.

సజావుగా ఎన్నికల ప్రక్రియకు కృషి

ప్రజాశక్తి-కాకినాడ

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సెక్టార్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టర్ పోలీసుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్‌తో కలిసి హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టర్ పోలీసులకు తొలి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సుమారు 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లను ఒక సెక్టార్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో ఓటు హక్కు నమోదు, వినియోగం అత్యంత కీలకమని ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎవరైనా అడ్డంకులను ఎదుర్కొనే సంఘటనలు గతంలో ఎక్కడైనా చోటు చేసుకుంటే ఆయా ప్రాంతాలపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్‌లు పూర్తి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులుగా నియమితులైన వారు ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ఆ సెక్టార్‌కు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

పిఆర్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగులకు డిజిటల్ విద్యపై ప్రత్యేక ఉపాధ్యాయులకు, ఐఇఆర్పిలకు శనివారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆర్‌జెడి జి.నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రశిక్షా సహితవిద్య విభాగం విజన్-2025లో భాగంగా ఇటీవల జిల్లా లోని దృష్టి, వినికిడి లోపం ఉన్న 250 మంది విద్యార్థులకు సమగ్రశిక్ష ద్వారా ట్యాబులను అందజేశారని, ఈ డిజిటల్ సాధనాల ద్వారా విద్యా బోధనపై సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ట్యాబులను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐఇ కన్సల్టెంట్ డాక్టర్ ఆర్.నరసింహం, చామంతి నాగేశ్వరరావు, పిఆర్.కళాశాల ప్రిన్సిపల్ బివి.తిరుపణ్యం, రిసోర్స్ పర్సన్లు కొల్లి ఈశ్వరరావు, పి.సునీల్, మహాలక్ష్మనాయుడు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి

భూముల పట్టాల కోసం 6వ రోజు దీక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

గుర్రంపాలెంలో తాము సాగు చేసుకుంటున్న ల్యాండ్ సీలింగ్ భూములకు పట్టాలివ్వాలని దళితులు చేపట్టిన నిరాహార దీక్షలు శనివారం 6వ రోజుకు చేరాయి. వీరు దీక్షలు చేపట్టడంతో రెండో దఫా పట్టాలిచ్చే ప్రక్రియను అధికారులు నిలుపుదల చేశారు. అయినా సాగు రైతులు దీక్షను కొనసాగిస్తున్నారు. తమకు పట్టాలిచ్చే విధంగా చర్యలు తీసుకునేంత వరకు ఈ దీక్షలు కొనాగిస్తామని స్పష్టం చేశారు. దీనిపై తహశీల్దారు బి. శ్రీదేవి మాట్లాడుతూ కొంత మందిని గుర్తించి వారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని, వీరి ఆందోళన నేపథ్యంలో వాటిని నిలుపుదల చేశామని చెప్పారు.

నిరాహార దీక్షలో పాల్గొన్న దళితులు

కార్టూన్ 'నిజం'



టిడిపి, జనసేన ప్రభుత్వం తథ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మహిళా శక్తి చైతన్యంతో టిడిపి, జనసేన పార్టీలు సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం మండల కేంద్రమైన జగ్గంపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ మహాశక్తి చైతన్య రథయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ గత 90 రోజులుగా మహాశక్తి చైతన్య రథయాత్రతో మహిళలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ మహిళా శక్తి పథకాలు కరపత్రాలను పంపిణీ చేసి పథకాల యొక్క ప్రాధాన్యతను ప్రజలకు వివరించిన మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చైతన్యంతో రేపు రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీ సంకీర్ణ ప్రభుత్వం విజయం సాధిస్తుందని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు అంతం పలికేందుకు ప్రజలందరూ ఎదురుచూస్తున్నారన్నారు. మహిళా సాధికారతలో భాగంగా ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపిల్ల మొదలుకొని 59 ఏళ్లు వచ్చేవరకు నెలకు రూ.1500 వారి ఖాతాలో జమ చెయ్యడానికి సంసిద్ధం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, కోట సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, గుమ్మళ్ల అనంతలక్ష్మి, రాపాక లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా శక్తి మహిళలతో జ్యోతుల నెహ్రూ

రైతులను ఆదుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులను ఆదుకోవడం అందరి బాధ్యత అని కాకినాడ ఆర్‌డిఒ కిషోర్ అన్నారు. వేట్లపాలెంలోని రైస్ మిల్లులు యజమానులతో శనివారం ఆర్‌డిఒ అత్యవసర సమావేశం నిర్వహించారు. రైతులు కష్టపడి పండించుకున్న ధాన్యం కళ్లాల్లో ఉన్నందున తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమయ్యిందన్నారు. గోనె సంచుల సరఫరాపై మిల్లర్లతో ఆర్‌డిఒ చర్చలు జరిపారు. కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని సత్వరం రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లర్లకు సరఫరా చేయడం తోపాటు రైతులు నష్టపోకుండా ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. దానికి మిల్లర్లంతా పూర్తి స్థాయిలో సహకారం అందించాలన్నారు. తక్షణమే రైతు భరోసా కేంద్రాలకు సంచులు అందించడం ద్వారా రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. తొలుత ఆయన వేట్లపాలెం పొలాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శిష్టా లక్ష్మీ నరస కుమారి, కొప్పిశెట్టి కీర్తి, మామిడాల కామరాజు, కెవివి.సత్యనారాయణ, మురళిపాల్గొన్నారు.

కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

నేరాలు ఘోరాలు

సారా తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని గుడ్డుగూడెంలో నాటు సారా తయారీ కేంద్రంపై ఎస్ఇబి అధికారులు శనివారం దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఇబి సిఐ డి.సుధా మీడియాకు వెల్లడించారు. ముందస్తుగా తమకు వచ్చిన సమాచారంతో ఎస్ఇబి ఎస్ఐ పి. సుధీర్, సిబ్బంది గుడ్డుగూడెంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దిరిసిపోము చిట్టిబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకవడంతో పాటు, 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 8 మంది పాత నేరస్తులను డిటి ముందు బైండోవర్ చేసినట్లు సిఐ తెలిపారు.

బైకు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మోటార్ సైకిల్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మేర్లపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీరాములు శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు ఎప్పటిలాగే మోటార్ సైకిల్ పెట్టాడు. అయితే అతను ఉదయం లేచి చూసేసరికి లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని. భావించి శనివారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రూ.లక్షలు విలువ చేసే వాహనాలను రోడ్లమీద పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వీల్ లాక్ వేసి భద్రపరుచుకోవాలని ఎస్ఐ తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం : ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఇబి అధికారులు చేసిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాలు... ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో ఒక మహిళ వద్ద నుంచి 10 లీటర్లు, మరో మహిళ వద్ద నుంచి 5 లీటర్లు, వీరవరం గ్రామంలో ఒక వ్యక్తి నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు. అనంతరం అన్నవరం గ్రామంలో ఎస్వివి సత్యదేవ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి, ప్రమాణాలు చేయించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాసరావు, డిటిఎఫ్ ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వర రావు, ఇంటెలిజెన్స్ వింగ్ ఇన్స్పెక్టర్ కె.గిరిధర్, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పసలపూడి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పసలపూడి గ్రామానికి చెందిన తీట్ల విశ్వేశ్వరరావు (38), భార్య రాణీల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడి, ఇరువురు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య కాపురానికి రానందున మనస్థాపం చెందిన విశ్వేశ్వరరావు శనివారం ఇంటి వద్ద పొలంలో వాడే గుళికలు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతిని తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. కె.రామారావు తెలిపారు.

ముగింపు సభలో మాట్లాడుతున్న దొరబాబు

సమాధుల స్థలం సమస్య పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

క్రైస్తవుల సమాధుల తోట స్థలం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు హామీ ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్లో సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన 32వ వార్షిక మహాసభలు, క్రిస్మస్ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సభలు ముగింపులో బాగంగా నాలుగో రోజు నిర్వహించిన గ్రాండ్ క్రిస్టమస్ వేడుక ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో దొరబాబు, కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ సమాధుల తోటకు స్థలం కొరత ఉన్నందున చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ వేడుకల్లో డాక్టర జిఆర్.ఇమ్మాన్యుయేల్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, అసోసియేషన్ నాయకులు కె.కిషోర్ బాబు, పి.బన్ను ప్రసాద్, పి.జ్ఞానరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నిధులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

అంగన్వాడీ కేంద్రాల మరమ్మతుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంపిడిఒ వసంత కుమార్ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నాడు- నేడు పేజ్-2బిలో భాగంగా జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు ఈ నిధులు మంజూరయ్యాయి అన్నారు. దీనికి సంబంధించిన ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కన్వీనర్గా అంగన్వాడీ కార్యకర్త, మండల పరిషత్ హెచ్ఎం, అంగన్వాడీ సూపర్వైజర్, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్, తల్లుల కమిటీ నుంచి ముగ్గురిని ఎంపిక చేయాలన్నారు. డిఇ ఉమాశంకర్, జెఇ పివి.నారాయణ, ఎంఇఒ స్వామి, వివి.అరుణశ్రీ, జి.సునీత, ఎస్.అమ్మాజీ, ఎ.నాగ పార్వతి, పి.బూసమ్మ, ఎస్కె.కరీమున్నీసా పాల్గొన్నారు.

యానాం వార్తలు

రాయితీ గ్యాస్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఎల్పిజి గ్యాస్ వినియోగదారులు తమ వివరాలను ఆన్ లైన్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. యానాంలో కేవలం 3,900 మంది రేషన్కార్డు వినియోగదారులు మాత్రమే గ్యాస్ రాయితీకి నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

మిచాంగ్ తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఒ మునిస్వామి సూచించారు. స్థానిక ఆర్ఎఒ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో తుఫాన్ అంశంపై సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. 20 మంది ఎన్డిఆర్ఎఫ్ బృందం యానం చేరుకుందని, మత్స్యకారులెవ్వరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. ఈ నెల 4న తీరం దాటుతున్న నేపథ్యంలో యనాంలో పాఠశాలలకు సెలవును పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రి యదర్శిని ప్రకటించారు. ఈ మేరకు సెలవును విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.

నూతన ఆవిష్కరణలు అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఇంజనీరింగ్లో నూతన ఆవిష్కరణలు చేయాలని జెఎన్టియుకె కంప్యూటర్ సైన్స్ విభాగం డైరెక్టర్ ఎ.కృష్ణ మోహన్ అన్నారు. పటవలలోని పైడా గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సెమినార్ హాల్ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎక్కువ మంది ఉన్నత శ్రేణిలో జీతం, విలాసవంతమైన జీవితాన్ని అనుభవించడానికే ఈ కోర్స్ను ఎంచుకుంటున్నారని అది కేవలం ఒక ఆలోచన మాత్రమే అన్నారు. రాబోయే 40 నుంచి 50 ఏళ్ల వరకు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు దిశగా ఆలోచించాలని అప్పుడే చదువుకు సార్థకత చేకూరుతుందన్నారు. ని అన్నారు. ఇంజినీరింగ్లో మిగిలిన కోర్సులకు లేని ఎన్నో అవకాశాలు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు పరిశోధనల దిశగా ముందడుగు వేయాలని సూచించారు. సెక్రటరీ శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల నైపుణ్యాలను అభివద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూర్యప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, డీన్ వీరభద్ర రావు, డిడి రవీంద్ర రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

పోటీల్లో గెలిచిన విజేతలతో మేనేజ్మెంట్

ఘనంగా కామర్స్ మేనేజ్మెంట్ దిశ-2023

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో శనివారం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ దిశ -2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన ముగింపు సభలో జోన్ పెట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ నందకుమార్ దాస్ మాట్లాడారు. ప్రతి విద్యార్థీ జీవితంలో సాధించే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే గమ్యస్థానాల వైపు సాగిపోవాలన్నారు. వెల్ గోయింగ్ శిక్షా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలం తండమ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మానసిక సామర్థ్యాన్ని పెంచుకున్నప్పుడే జీవితంలో ఎదురుపడే సమస్యలను సులువుగా పరిష్కరించుకోగలుగుతారన్నారు. ప్రొఫెసర్ సంతానం మాట్లాడుతూ కామర్స్ విభాగం ప్రాధాన్యతను గుర్తించినందునే శ్రీ ప్రకాష్ సంస్థ మ్యాథ్స్, సైన్స్తో పాటు కామర్స్కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ సదస్సులో స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, అకడమిక్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా నిర్వహించిన పోటీల్లో పాయకరావుపేట, తుని, కాకినాడ, రాజమండ్రి పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

అభివృద్ధి పనులు భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ సతీష్

జి.వేమవరం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

జి.వేమవరం పంచాయతీకి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. అడవిపూడిలో రూ.10 లక్షలు, రామాలయంపేటలో రూ.5 లక్షల సిఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శనివారం భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపిటిసి యర్రంనీడి అప్పారావు, దెయ్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ గ్రామ ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా, ఆప్యాయత అనురాగాలతో ఉంటారని అందువల్ల ఈ గ్రామం అంటే తనకెంతో ఇష్టం అన్నారు. ఫిబ్రవరి లోపు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందిస్తామన్నారు. అనంతరం అడవిపూడిలో రూ.10 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్, జెడ్పిటిసి సాగర్, మట్ట లింగమూర్తి, దెయ్యాల సత్యనారాయణ, శ్రీపాదం శ్రీనివాస్, ధూళిపూడి బాబి, కె.నాగరాజు, దున్న శ్రీకాంత్, బొంతు వెంకటరమణ పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి విద్యార్థి వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. శనివారం చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వినియోగదారుల చట్టం-2019పై ఆయన అవగాహన కల్పించారు. వినియోగదారులు మోసానికి గురైతే జిల్లా వినియోగదారుల కేంద్రం సహాయ సహకారాలతో న్యాయం పొందవచ్చునన్నారు. చట్టంలోని పలు అంశాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్విఎస్.శాస్త్రి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ అటెన్షన్...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక వైపు జిల్లాలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు, మరోవైపు తెలంగాణలో జరిగిన ఎన్నికల ఫలితాలు ఉత్కంఠ నెలకొంది. తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమం కోనసీమ జిల్లా నుంచే పునఃప్రారంభించిన విషయం విధితమే. స్కిల్ డవలెప్మెంట్ కార్పొరేషన్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ఆ పార్టీ అధినేత చంద్రబాబును రిమాండ్కు తరలించడంతో యువగళం తాత్కాలికంగా బ్రేక్ పడింది. అనంతరం చంద్రబాబుకు బెయిల్ రావటం, రోజుల వ్యవధిలోనే యువగళం ప్రారంభించడంతో టిడిపి శ్రేణులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. అదే స్థాయిలో అధికార పార్టీలోనూ మంత్రులు రాక, సభలు సమావేశాల నిర్వహణతో పార్టీ శ్రేణులను ఆకట్టుకునే ప్రయత్నం జరుగుతోంది. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా సంకేతాలు విన్పిస్తున్నాయి. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నిర్వహించే బహిరంగ సభలు విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తుతున్నాయి. కొన్ని సందర్భాలలో వ్యక్తిగత విమర్శలు సైతం పాల్పడటం సాధారణ ప్రజలను విస్తుగొలుపుతోంది. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు నేడు విడుదల కానున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో గెలుపు ఓటములపై జిల్లాలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఉమ్మడి గోదావరి జిల్లాలోని అత్యధిక జనాభా హైద్రాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో స్థిరపడటంతో అక్కడి ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

అధికారులు సమాయత్తం

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు పూర్తి చేస్తుందా..? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రకటించిడం, అభ్యంతరాలను స్వీకరించడం వంటి కీలక కార్యక్రమాలు నిర్వహించిన విషయం విధితమే. మరోవైపు కొత్త ఓట్లు నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్చుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. అధికార, ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతోపాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలకు కసరత్తులు ప్రారంభం అయ్యాయి. ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు (బియూ), ఓటర్ వెరి ఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిప్యాట్), కంట్రోల్ యూనిట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. బెంగుళూరు బెల్ కంపెనీ నుంచి సరఫరా చేసిన 4930 వివి ప్యాడ్స్ను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేసి స్ట్రాంగ్ రూం గోడౌన్ డిపాజిట్ చేశారు. ఇప్పటికే ఫస్ట్లెవల్ కమిటీ (ఎఫ్ఎల్సీ) పరిశీలన ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అత్యంత కీలకమైన వివి ప్యాట్లను లాలాచెరువులోని స్ట్రాంగ్రూంలో భద్రపరిచారు. సిసి కెమెరా, 24 గంటల పర్యవేక్షణతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

ముందస్తు రబీ సాధ్యమేనా..?

జిల్లాలో ముందస్తుగా రబీ సాగు సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారుల సూచనల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచే సాగుకు సిద్ధం కావాలని ఆదేశించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా సాగు చేపట్టకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అయితే ఖరీఫ్ సాగుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 50 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం పూర్తయ్యేందుకు నెలాఖరు వరకూ సమయం పడుతుందని రైతులు, రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. మరో వైపు తుఫాను హెచ్చరిక రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఆరుగాలం పండించిన పంట దిగుబడులను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి రైతులు తర్వాత పంటకు సిద్ధమయ్యేందుకు కనీసం నెల రోజుల వ్యవధి తప్పదు. సాగునీటి కేటాయింపులకు సంబంధించి అధికారులు ఏ మేరకు జాగ్రత్తలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఆశా వర్కర్ల పోరాటం విజయవంతం

శీలబోయిన దుర్గాదేవి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. దుర్గాదేవి కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం ఆధ్వర్యంలో 11 రోజులుగా దీక్షను చేపట్టడంతో అధికారులు దిగొచ్చారు. దుర్గాదేవి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని లిఖిత పూర్వక హామీని ఆశా వర్కర్ల ఉందోళనతో సాధించుకున్నారు.

400 మందికి దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -కరప

మండలంలోని వేళంగిలో ట్రస్ట్ ఆఫ్ బోండా ఆధ్వర్యంలో త్రైమాసిక వార్షికోత్సవాల్లో పిఠాపురం మహారాజ్ వారసులు రావు వెంకట కుమార్ మహాపతి రామారత్న రావు పాల్గొని ఘనంగా నిర్వహించారు. వేళంగిలో శ్రీనివాస నర్సింగ్ హోమ్లో డాక్టర్ బోండా వెంకన్న రావు, డాక్టర్ బోండా వీర వెంకట సత్యనారాయణ, డాక్టర్ బోండా సూర్యారావు, డాక్టర్ బోండా రాజ్ కుమార్ పాల్గొని ఆర్థిక సాయం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరికరేవులకు చెందిన వైద్య విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సాయం, కాకినాడ దయ పౌండేషన్ భవనం నిర్మాణానికి రూ.10 వేలు, వేళంగి స్కూల్ బోర్డు ఏర్పాటుకు రూ.10 వేలు, 400 మంది నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రముఖ డాల్ఫిన్ హోటల్స్ అధినేత బదిరెడ్డి వెంకన్న, ఎన్.సి.సి ఆఫీసర్ వెంకట రమణమూర్తి, వేళంగి పంచాయతీ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాసరావు, బొండా ట్రస్ట్ డైరెక్టర్లు బొండా లక్ష్మి కుమారి, హరిత రాణి, హరిణి పాల్గొని, సాధనాల శ్రీనివాసు, ఇళ్ల ఆదేశ్,చసుంకర చంటి, గరగా రామయ్య, జమిలి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఇవిఎంల పనితీరుపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ కె.సురేంద్ర పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరుపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ సీనియర్ సహాయకులు జగన్నాథం, మహేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇవిఎంల పనితీరు, ఓటు వేసే విధానం, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై అందరికీ డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండేందుకు ఈ విధానం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరు వేలకు పైగా ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

దృష్టి ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 6 వేలకు పైగా పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్టు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.మాధురీ మహోన్నత్ వెల్లడించారు. సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా ప్రారంభించే బ్రాంచి ఆసుపత్రి సేవలపై ఎండి డాక్టర్ మాధురి, విజన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహోన్నత్ శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లాభాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా పేద ప్రజలకు సాధ్యమైనంత వరకు ఉచిత సేవలను అందించేందుకు దృష్టి ఐ కేర్ ఆసుపత్రి నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కాకినాడ జిల్లా పరిధిలో 118 ఉచిత నేత్ర శిబిరాలు ఏర్పాటు చేసి వందల మందికి సేవలు అందించామన్నారు. వైద్యం విషయంలో మల్టీ స్పెషాలిటీ, నేత్ర, ఫిజియోథెరపీ సదుపాయాలు ఒకేచోట అందుబాటులో ఉంటే పూర్తిస్థాయి వైద్యం ప్రజలకు అందుతుందన్నారు. దీనిలో భాగంగానే విజన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి స్థానికంగా ఉండగా కాకినాడలో ఉన్న దృష్టి ఐ కేర్ ఆసుపత్రి బ్రాంచిని సామర్లకోటలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని కాండ్రకోట, కట్టమూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం మండల విస్తరణ అధికారి కె.రాజశేఖర్ ఆకస్మికంగా పరిశీలించారు. కట్టమూరు సంపద తయారీ కేంద్రం వద్ద డంపింగ్ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ చెత్త రహదారులపై పడకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. షెడ్ నిర్మాణానికి సంబంధించి నిధుల మంజూరుపై అధికారులతో చర్చిస్తానని తెలిపారు. సంపద తయారీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, నల్లల గోవిందు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కరప

అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు. శనివారం కరప మండలంలోని పలు ప్రాంతాలలో ఉన్న దాన్యపు రాశుల వద్దకు వెళ్లి రైతులను అప్రమత్తం చేశారు. రైతులు మూడు రోజులు పాటు ఆఫ్లైన్లో ధాన్యం కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దగ్గర్లో ఉన్న రైస్ మిల్లులుకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని తెలిపారు. దీనిలో భాగంగా ధాన్యం తేమ శాతం 15 ఉండాలని తెలిపారు.

ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

మండలంలో కొత్త ఓటర్ల నమోదు, సవరణల స్పెషల్ డ్రైవ్ను పెద్దాపురం ఆర్డిఒ సీతారామారావు శనివారం పరిశీలించారు. మండలంలోని వికె.రాయపురం, మాధవపట్నంలో పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. స్పెషల్ డ్రైవ్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓట్ల నమోదు, ఓటరు జాబితాలో ఓటర్ల వివరాల సవరణలు విషయంలో బూత్ లెవల్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు అందించారు. మధ్యాహ్నం వరకు వచ్చిన అభ్యర్థనలపై ఆయన రికార్డులు పరిశీలించారు. తుది ఓటర్ జాబితాల ప్రకటన సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ రెండు రోజులపాటు పోలింగ్ కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కరప : జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కరప గ్రామంలోని 66వ పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదు ఇతర అంశాలపై ఆయన పాల్గొని బూత్ లెవెల్ అధికారులకు సూచనలు చేశారు. కొత్త ఓటర్లుగా పురుషులు 62, స్త్రీలు 61 ఫారం 6 నింపి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఫారం 7లో 29 మంది పురుషులు 19 మంది స్త్రీలు క్లెయిములు ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాచరరావు, విఆర్ఒ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, undersigned **MOHAMMED AKBAR (Old Name) S/o AHMAD HUSSAIN (Late),** Aged 72 Years, Resident of D.No.2-13-16, Santhi Nagar, Nidadavole-534 301, A.P. Changing my name form MOHAMMED AKBAR (Old Name) to **MOHAMMAD AKBAR** (New Name) hence forth I am being called as **MOHAMMAD AKBAR** (New Name) for all purposes.

CHANGE OF NAME

I, undersigned **FATHIMUNNISA MOHAMMED(Old Name) W/o MOHAMMAD AKBAR,** Aged 68 Years, Resident of D.No.2-13-16, Santhi Nagar, Nidadavole-534 301, A.P. Changing my name form FATHIMUNNISA MOHAMMED (Old Name) to **FATIMUNNISA** (New Name) hence forth I am being called as **FATIMUNNISA** (New Name) for all purposes.

PUBLICATION
In the Court of the Hon'ble Senior Civil Judge, Amalapuram
O.P. No. 174 of 2022

Between:
Padala Srisatya, W/o. Srinivasa Reddy, D.No. 2-5-37, Sri Ganesh Gas & General Stores, Sitapathiraopeta, Amalapuram, Dr. B.R.Ambedkar Konaseema Dist., ***...Petitioner***
Vs
Budda Lakshmi Amrutha, Pujitha Hospital, Panta Kalva Road, NTR Circle, Near Saptagari Bank, Patamata, Benz Circle, Vijayawada - 520010, NTR Dist., ***...2nd Respondent***

The above named petitioner has instituted the above petition against you, and the same stands posted to **14-12-2023 at 10.30 A.M** for your appearance. You are hereby required to appear personally or through advocate attend before this Hon'ble Court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per law.
//By the orders of the Hon'ble Court//
D.V.V.S.MURTHY
Advocate, Amalapuram
Amalapuram, Dt. 30-11-2023, Cell: 9848344577

వేలం ప్రకటన
మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 32/2018 in O.S. 119/2016

Between:
శీరం రాజశేఖర్ ***...DHR***
మరియు
శీరం లక్ష్మినారాయణ ***...JDR***

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 18-12-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని పాడుకొనవలసిందిగా తెలియ జేయడమైనది. వివరములు కోర్టు వారు శ్రీ కోర్టు వారి నజారత్లో గాని, DHR అడ్వకేట్ గారి ఆఫీసులో గాని తెలుసుకోవలెను.

షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం సబ్-రిజిష్ట్రి, పిఠాపురం మునిసిపాలిటీ, పిఠాపురం 3వ వార్డులో 164 చదరపు గజముల విస్తీర్ణంగా గల D.No. 3-2-27/C/1 RCC డాబా ఇంటికి హద్దులు. **తూర్పు:** దండి జ్యోతి గారి ఇల్లు. **దక్షిణం:** శీరం గోపాలకృష్ణ గారి ఇల్లు మరియు స్థలం. **పడమర:** రోడ్డు. **ఉత్తరం:** శీరం నాగ సత్యనారాయణ గారి ఖాళీ స్థలం.

పై హద్దుల మధ్యస్తమయిన ఆర్సిసి డాబా ఇల్లు, అందలి దారి మార్గములు, నీటి వనరులు మరియు ఎలక్ట్రికల్ ఫిటింగులు సమస్త యూజుమెంటు హక్కులతో సహా వేలం వేయబడును.
అమీన విలువ: రూ. 25,00,000=00
D.Hr విలువ: రూ. 12,00,000=00

శ్రీ పదాల రవి
శ్రీ యాళ్ళ బదరీనారాయణమూర్తి
పిఠాపురం, ది.29-11-2023, అడ్వకేట్స్, పిఠాపురం

In the Court of the IIIrd Additional District Judge at Kakinada
A.S. No. 40/2023

Between:
Allu Veera Venkata Srinivasa Rao ***...Appellant/ Defendant***
AND
Kesavarapu Venkateswara Rao ***...Respondent/ Plaintiff***

To:
Kesavarapu Venkateswara Rao, S/o. Mallikarjuna Rao, aged 59 years, Business, R/o. D.No. 1-B, Satyadurga Nagar, Turangi, Kakinada. ***...Respondent***

పై నెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా తప్పించుకుని తిరుగుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 11-12-2023వ తేదీకి వాయిదా వేసినారు.. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై అప్పీలు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
G.DIVYA SREE VIDYA
D/o. G.PAIDARAO, Advocates
Kakinada, Cell: 9246699297

ప్రకటన
మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. No. 848/2023

Between:
ముప్పిడి సూర్యావతి అనే భానుమతి ...వాది
మరియు
1) **చోడిశెట్టి కామేశ్వరి,** W/o.(లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
2) **చోడిశెట్టి ప్రసాద్,** S/o. (లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
3) **చోడిశెట్టి అచ్చిరాజు,** S/o. (లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
4) **చోడిశెట్టి పాపారావు,** S/o.(లేటు) రామారావు, డో.నెం. 13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
...ప్రతివాదులు

పై నెంబరు దావాలో 1 నుండి 4 ప్రతివాదులకు శ్రీ కోర్టువారి నుండి ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, సదరు 1 నుండి 4 ప్రతివాదులు **ది. 22-12-2023 సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల పై నెంబరు దావా మీ పరోక్షంలో శ్రీ కోర్టువారు తగు చర్యలు గైకొనగలరు.
N.V.హయగ్రీవరావు, అడ్వకేట్
డో.నెం. 21-1-7, సాలిపేట, కాకినాడ. సెల్: 98495 99091
కాకినాడ. ది.02-12-2023